


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 22-02-2026 సంపుటి : 07 సంచిక 277 పేజీలు : 8 వెల : రూ 3-00


# ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే ఉద్దేశం


## వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం: సిఎం చంద్రబాబు



అమరావతి ఫిబ్రవరి 21 వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం వస్తుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారని అన్నారు. పల్నాడు జిల్లా-వినుకొండలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మీకు ఆదాయం వస్తుందని, 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తమ ఉద్దేశం అని.. అందుకే ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో పాల్గొంటానని అన్నారు. విశాఖలో చెత్త నుంచి కరెంటు తయారు చేస్తున్నారని, మరో ఐదు ప్లాంట్ల ద్వారా కరెంటు తయారు చేస్తామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రాష్ట్రంలో బ్యాన్ చేశామని చెప్పారు. మార్చి 31 కల్లా వందశాతం ఇంటినుంచి చెత్త సేకరించేలా చేస్తామని, చెత్త ద్వారా మళ్లీ వస్తువుల ఉత్పత్తులు చేస్తామని సిఎం పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంలో మనమే నెంబర్ వన్ అని..వ్యవసాయంలోనూ ఎఐ సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. ఎన్ డిఎ కూటమి రాష్ట్రంలో పెను మార్పులు తీసుకురాబోతుందని, సూపర్ సిక్స్..సూపర్ హిట్ చేశామని తెలియజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తామని, స్త్రీశక్తి, దీపం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల ఆదాయం పెంచేందుకు పి4 పథకం ఉందని, టెక్నాలజీ వినియోగాన్ని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ మెచ్చుకున్నారని అన్నారు. పల్నాడు అంటే పౌరుషాల గడ్డ అని.. పల్నాడు వస్తే వైబ్రేషన్స్ వస్తాయని, శివరాత్రి అంటే కోటప్పకొండ ప్రభలు ప్రత్యేకం అని కొనియాడారు. ఎఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవవేదన కలిగించిందని, కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదని సూచించారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని, దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని కోరారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో తన సతీమణిని కూడా అవమానించారని, 23 క్లేమోర్ మైన్స్ ప్రయోగించినా తాను భయపడనని అన్నారు. వెంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని, వెంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. మాజీ మంత్రి, దివంగత నేత వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని, నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారని, ఇప్పుడు కూడా లడ్డూ కల్తీ చేసి హెరిటేజ్ పేరు తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ప్రాణం పోయినా తప్పు చేయనని, లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందని తెలిపారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, తప్పును పక్కన వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారని, నేరగాళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నాయుడు హితవు పలికారు.

# ఉగ్ర ముప్పు హెచ్చరికల వేళ..

## కశ్మీర్‌లో ఐ-ఈడీని గుర్తించిన సైనికులు



చర్యలు చేపట్టిన భద్రతా బలగాలు జమ్మూకశ్మీర్ లో ఉగ్ర కుట్రను భగ్నం చేశాయి.గండేర్‌బాల్ జిల్లాలో రోడ్డు పక్కన ఓ బ్యాగులో మందుపాతర(ఐఈడీ)ను భారత సైన్యం గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే బాంబ్ స్క్వాడ్ సాయంతో పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసినట్లు అధికారులు తెలిపారు. సఫాపోరా ప్రాంతంలోని కోహెస్తాన్ కాలనీకి సమీపంలోని గులాబ్ షేక్ మొహల్లా వద్ద రోడ్డుపక్కన ఐఈడీ ఉన్న బ్యాగును అధికారులు గుర్తించారు. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు.అలానే మరికొన్ని ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఏవైనా అనుమానాస్పద వస్తువులు ఏమైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలను కోరారు. ఉగ్ర ముప్పు( పొంచిఉందని నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీస్ బృందాలు, భద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

## శ్రీవారిని రాజకీయ ఆయుధంగా వాడుకోవడం మహాపాపం: ప్రత్తిపాటి పుల్లారావు

పల్నాడు జిల్లా, ఫిబ్రవరి 21: చిలకలూరిపేటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సంప్రోక్షణ చర్యలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఆలయాన్ని శుద్ధి చేశారు ప్రత్తిపాటి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరునితో వైసీపీ రాజకీయ పరాచకాలు ఆడుతోందని మాజీ మంత్రి తీవ్రంగా విమర్శించారు. స్వామివారిని రాజకీయ ఆయుధంగా వాడుకోవడం దుర్మార్గమని.. మహా పాపమని అన్నారు.శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయాలన్నదే వైసీపీ లక్ష్యమన్నారు. మండలిలో తమకు బలం ఉందని భావించి కుట్రలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని రుజువైనా కావాలనే శాసనమండలిలో రచ్చ చేస్తున్నారని ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. కల్తీ నెయ్యి అంశాన్ని పక్కదారి పట్టించడానికే హెరిటేజ్ సంస్థను రాజకీయాల్లోకి లాగారని తెలిపారు.రాజకీయాలకు తనను వాడుకుంటున్న వారిని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారనేది చరిత్ర ఎరిగిన సత్యమని హెచ్చరించారు. హిందూ సమాజం, శ్రీవారి భక్తుల మనోభావాలు కాపాడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు.

# మార్చి 31లోగా దేశంలో నక్సలిజం అంతం: మంత్రి అమిత్ షా

గౌహతి: మార్చి 31 లోగా దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. 87వ సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఆయన చెప్పారు. అక్కడ రాళ్లు రువ్వే ఘటనలు సున్నాకు పడిపోయినట్లు వెల్లడించారు. మణిపూర్‌లోనూ వర్గ హింసను ఆ దళాలు కట్టడి చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్లలో మావోయిస్టుల వెన్ను విరిచినట్లు సీఆర్పీఎఫ్‌ను మంత్రి షా కీర్తించారు. సీఆర్పీఎఫ్‌పై నమ్మకంతో కాన్ఫిడెంట్‌గా చెబుతున్నానని, దేశంలో 2026 మార్చి 31వ తేదీ వరకు నక్సల్ సమస్యను నిర్మూలించనున్నట్లు షా తెలిపారు.చత్తీస్‌ఘడ్-తెలంగాణ బోర్డర్‌లో ఉన్న కర్రెగుట్టలో



ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌ను చేపట్టిన దళాలపై మంత్రి షా ప్రశంసలు కురిపించారు. ఆ ఆపరేషన్‌లో గత ఏడాది ఏప్రిల్, మే మధ్య కాలంలో 31 మంది నక్సల్స్ మరణించారు. సుమారు 46 డిగ్రీల ఎండలో ఆ ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు. నక్సల్స్ ఆధీనంలో ఉన్న ఆ కొండల్ని విముక్తి చేసేందుకు కేంద్ర రిజర్వ్ పోలీసులు దళాలు అత్యంత ధైర్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు.పదేళ్ల క్రితం దేశంలో మూడు అతిపెద్ద హాట్‌స్పాట్ కేంద్రాలు ఉండేవని, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో చొరబాటులు, చత్తీస్‌ఘడ్ అడవుల్లో నక్సలిజం పెద్ద సమస్యగా ఉండేవని, కానీ ఇప్పుడు ఆ ప్రాంతాలు ప్రగతి, శాంతికి సంకేతంగా మారాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో 700 మంది సీఆర్పీఎఫ్, నక్సల్ ప్రాంతాల్లో 780 మంది, జమ్మూకశ్మీర్‌లో 540 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు మంత్రి వెల్లడించారు. వీరి త్యాగాల వల్ల ఒకప్పుడు హింసకు కేంద్ర బిందువులైన ఆ ప్రాంతాలు ఇప్పుడు శాంతియుతంగా మారాయన్నారు.

## వైసీపీ నేతలకు మంత్రి టీజీ భరత్ బంపరాఫర్

కర్నూలు: వైసీపీ నేతలకు మంత్రి టీజీ భరత్ బంపరాఫర్ ప్రకటించారు. కర్నూలులో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానంలో కొత్త వ్యక్తిని ఎన్నుకుంటే.. 2029 ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కే అవకాశం ఉంటుందని సూచించారు. వైసీపీ అధ్యక్షుడిని మార్చాలని భావిస్తున్న నాయకులకు తాను ఆర్థికంగా సహాయం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని టీజీ భరత్ తెలిపారు.ఇటీవల జరిగిన తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై కూడా మంత్రి స్పందించారు. ఈ ఘటన వెనుక పలు కుట్రలు దాగి ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. జగన్ తిరుపతికి వెళ్లి తన పాలనలో తప్పులు జరిగాయని అంగీకరించి, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద శ్రీవారిని క్షమాపణ కోరితే ఈ వివాదం ఇంత పెద్దది అయ్యేదే కాదని వ్యాఖ్యానించారు.ఇక రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపై కూడా టీజీ భరత్ ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం దీర్ఘకాలం అధికారంలో కొనసాగుతుందని, ఇటీవల ఒక ఐఏఎస్ అధికారి కూడా 2039 వరకూ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తనతో చెప్పారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతుందని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.



## రాజకీయాలు ఎటు వెళ్తున్నాయో అర్థం కావడం లేదు: జగన్

అమరావతి: ఎఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తప్పుపట్టారు. ఇవాళ సోషల్ మీడియా ఖాతాలో జగన్ పోస్టు చేశారు. యూత్ కాంగ్రెస్ తీరు మనందరిని సిగ్గుపడేలా చేసిందని మండిపడ్డారు. రాజకీయాలు ఎటు వెళ్తున్నాయో అర్థం కావడం లేదని, రాజకీయ విబేధాలు ఎన్ని ఉన్నా దేశాన్ని ఎవరూ కించపరచకూడదని తెలిపారు. ఇండియా కృత్రిమ మేధ ఇంఫాక్ట్ సదస్సులో ఎగ్జిబిషన్ హాల్ నంబర్ 5 వద్ద యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. శుక్రవార మధ్యాహ్నం 12.30 గంటలకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి చేరుకొని టీ షర్టులు విప్పేసి ఆందోళనకు దిగారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.






# సంపాదకీయం

ఆదివారం 22-02-2026


## హిట్ అండ్ రన్ రాజకీయాల్లో ప్రతిపక్ష పార్టీలు

“నిజమైన ప్రతిపక్షం ప్రభుత్వానికి శత్రువు కాదు, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీసే ఒక జాగృత శక్తి “ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరగడం, మెజారిటీ వచ్చిన వారు పాలించడం మాత్రమే కాదు. అధికార పక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు కళ్ళెం వేసే ప్రతిపక్షం ఉండటం ఆ వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది. కానీ, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షం అంటే కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అనే సంకుచిత అర్థానికి పరిమితమైపోయింది. క్షేత్రస్థాయిలో పోరాటాల కంటే, సోషల్ మీడియా వేదికగా సాగే ట్రోలింగ్ రాజకీయాలే జ్యమేలుతున్నాయి.ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించే వ్యవస్థ. అసెంబ్లీలో తార్కికమైన చర్చలు, బయట ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు ఉండేవి. ఒక జీవో విడుదల చేయాలంటేప్రభుత్వం పదిసార్లు ఆలోచించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది.ప్రతిపక్షాలు తాము అధికారంలో లేమన్న విషయాన్ని జీర్ణించుకోలేక, ప్రజల కోసం పోరాడటం కంటే తమ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికార పక్షంపై వ్యతిరేకత పెంచితే చాలు, తదుపరి అధికారం తమకే దక్కుతుందనే ఒక రకమైన నెగటివ్ పాలిటిక్స్ భ్రమలో ప్రతిపక్షాలు ఉండిపోతున్నాయి. అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపడం కంటే, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాల ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఏకైక అజెండాగా మారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తోంది. గత ఎన్నికల్లో సుమారు 40 శాతం ఓటు బ్యాంకును, కోటి మందికి పైగా ప్రజల మద్దతును పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రతిపక్ష హోదా అనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి సభకు దూరం కావడం ఆ ఓటర్లను వంచించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్య కంటే గొంతుక ముఖ్యం. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, వారు సభలో తార్కికంగా మాట్లాడితే ప్రభుత్వం దిగిరాక తప్పదు. కానీ, వైసీపీ నాయకత్వం కేవలం తమపై వస్తున్న కేసుల నుండి రక్షణ పొందడానికో లేదా తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికో పరిమితమవుతోంది. తమ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజల వద్దకు వెళ్లాల్సింది పోయి, అధికార పక్షం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది అనే విక్టిమ్ కార్డ్ వేసుకోవడం వల్ల ప్రజల్లో సానుభూతి కంటే అసహనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీ చేస్తున్న పోరాటాలన్నీ ఎక్కువగా కేసుల చుట్టూ, పార్టీ నేతల రక్షణ చుట్టూనే తిరుగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలు , ప్రభుత్వ వైఫల్యాల మీద నిర్మాణాత్మక విమర్శలు చేయడం కంటే, సోషల్ మీడియాలో బురద చల్లడం పైనే ఆ పార్టీ యంత్రాంగం ఎక్కువ దృష్టి పెడుతోంది. రాజకీయం అంటే అధికారం కోసం చేసే ఆరాటం మాత్రమే కాదు, అధికారం లేనప్పుడు ప్రజల కోసం చేసే పోరాటం అన్న సూత్రాన్ని విస్మరించి, కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసించిపోతోంది. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల చర్చా వేదిక, అక్కడ గొంతు వినిపించకపోతే ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయినట్టే అవుతుంది.మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో బేషరతుగా మద్దతు ఇస్తూ, రాష్ట్రంలో అదే పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నామని చెప్పడం ప్రజల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది. ఈ ద్వంద్వ వైఖరి పరోక్షంగా అధికార పక్షానికే సహకరించడమే అవుతుంది. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్న ఈ రాజకీయం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. నాయకుడి బలం గెలిచినప్పుడు కాదు, ఓడిపోయినప్పుడు ఎలా నిలబడ్డాడు అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది..మరోవైపు, అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో వైసీపీ అనుసరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాల్సింది పోయి, ముఖ్యమంత్రిని, మంత్రులను , వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అప్రజాస్వామికం. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే కాకుండా, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే వ్యూహాన్ని బయటపెడుతున్నాయి. విమర్శలు విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద కాదు అనే కనీస రాజకీయ ధర్మాన్ని విస్మరించి, బూతు పురాణాలతో రాజకీయ కలుషితం చేయడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. దీన్ని వైసీపీ గుర్తించడం లేదు.తెలంగాణ రాజకీయ యవనికపై ఒకప్పుడు సింహగర్జన చేసిన గులాబీ దళం, నేడు ప్రతిపక్ష పాత్రను పోషించడంలో పూర్తిగా వెనుకబడిపోయింది. మేము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా అవతరించలేదు అని ఆ పార్టీ కీలక నేత జగదీష్ రెడ్డి స్వయంగా అంగీకరించడం వారి దైన్యస్థితికి అద్దం పడుతోంది. పదేళ్ల పాటు పరిపాలించిన అనుభవం ఉన్న పార్టీ, ప్రజా సమస్యలపై పదునైన బాణాలను సంధించాల్సింది పోయి, ఇంకా బాధ్యతారాహిత్యంతో కాలం గడుపుతోంది. ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది కేవలం ఫామ్ హౌస్‌లకే పరిమితం కావడానికి కాదు, అసెంబ్లీలో ప్రజా గొంతుకగా నిలవడానికి అని ఇప్పటికీ గుర్తించలేకపోతున్నరా?. బీఆర్ఎస్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం కంటే, సోషల్ మీడియా వేదికగా అబద్ధాలను వందసార్లు ప్రచారం చేసి నిజం చేయాలనే వ్యూహంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే విశ్వసనీయత ను వారు కోల్పోతున్నారు.రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు

## రూ.22 లక్షల విలువైన 107 మొబైల్ ఫోన్లు రికవరీ



సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 21 : సూర్యాపేట జిల్లాలో ఒక ఏడాదిలో వివిధ రూపాల్లో పోగొట్టుకున్న 1,430 మొబైల్ ఫోన్స్‌ను జిల్లా పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందించేసినట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ రికవరీ మేళాలో రూ. 22 లక్షల విలువ గల 107 మొబైల్ ఫోన్లను బాధితులకు ఆయన అందజేసి మాట్లాడారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతున్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం, పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారని కొనియాడారు. బీహార్, ఒడిశా, జార్ఖండ్ లాంటి ఇతర రాష్ట్రాల నుండి ఈ మొబైల్స్ ను రికవరీ చేసినట్లు చెప్పారు.నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మద్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. తప్పుడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు, నేరాలకు పాల్పడే వారికి ఫ్రెండ్లీ పోలీస్ ఉండదని సామాన్యుల పట్ల మాత్రమే ఫ్రెండ్లీ పోలీస్ అన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా వెంటనే సి ఇ ఐ ఆర్ పోర్టల్ ( ష్ట్రబిబిజూబ://లిలిలి.ఞవతితీ.ణనీల.తిని ) నందు నమోదు చేసుకోవాలని, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు శాఖ చాకచక్యంగా పనిచేసి పెద్ద మొత్తంలో ఫోన్స్ రికవరీ చేసి ఇక్కడ బాధితులకు అందించడం జరిగినదన్నారు.మీ పిల్లలు డ్రగ్స్, అమ్మాయిల రవాణా లాంటి కేసుల్లో చిక్కుకున్నారు, డిజిటల్ అరెస్ట్ చేస్తాం అని సీబీఐ, సిఐడి లాంటి దర్యాప్తు సంస్థల పేర్లు చెప్పి డబ్బులు చెల్లించితే కేసు నుండి తప్పిస్తాం అంటే నమ్మవద్దని డిజిటల్ అరెస్ట్ అబద్ధమన్నారు. జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ ను సి ఇ ఐ ఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ సిబ్బందిని, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఏఐ సమ్మిట్‌లో నిరసన .. నిందితుల బెయిల్ తిరస్కరించిన పాటియాలా కోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని భారత్ మండపంలో కృత్రిమ మేధపై సదస్సు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ సదస్సులో శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేపట్టారు. పైదుస్తులు విప్పి ఆందోళనకు దిగారు. అమెరికాతో జరిగిన ట్రేడ్ డీల్‌ను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ శుక్రవారం యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సదస్సు జరుగుతున్న భారత్ మండపం వద్ద చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. వారిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. క్యూఆర్ కోడెడ్ పాసులను ఉపయోగించి ఏఐ సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశించిన సుమారు 10 మంది యువజన కాంగ్రెస్ కార్యకర్తలు హాల్ నంబర్ 5 లోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇవాళ పాటియాలా హౌజ్ కోర్టులో ఈ ఘటనపై వాదనలు జరిగాయి. నలుగురు నిందితుల బెయిల్‌ను కోర్టు తిరస్కరించింది. అరెస్టు అయిన వారిలో యూత్ కాంగ్రెస్ సభ్యులు కృష్ణ హరి, కుందర్ యాదవ్, అజయ్ ఉన్నారు. నలుగురిని అయిదు రోజుల పోలీసు కస్టడీలోకి పంపారు.ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ ఓ కుట్ర ప్రకారం నిరసన చేపట్టినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ యువతను వాడుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఇంత కన్నా సిగ్గుమాలిన చర్య ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టడం ఎప్పుడు ఆపేస్తారని మంత్రి రిజిజు ప్రశ్నించారు. ఏఐ సమ్మిట్‌లో జరిగిన ఘటనను యావత్ దేశం ఖండిస్తున్నదన్నారు. యువతను రెచ్చగొట్టి కాంగ్రెస్ పార్టీ నేరానికి పాల్పడినట్లు ఆరోపించారు.




## రాహుల్‌కు నల్లజెండాలతో బీజేపీ కార్యకర్తల నిరసన

ముంబై: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ కు కాంగ్రెస్ కార్యకర్తలు అంతరాయం కలిగించడంపై బీజేపీ కార్యకర్తలు శనివారంనాడు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఆ పార్టీ మద్దతుదారులు, యువజన విభాగం కార్యకర్తలు దేశవ్యాప్తంగా పలుచోట్ల రోడ్లపైకి వచ్చారు. నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఢిల్లీ, సూరత్, ములుండ్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. మహారాష్ట్రలోని ములుండ్‌లో రాహుల్ గాంధీకి నిరసనల సెగ తగిలింది. ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఒకరు వేసిన పరువునష్టం కేసులో పూచీకత్తు ఇచ్చేందుకు ఆయన థానే వెళ్తుండగా బీజేపీ కార్యకర్తలు నల్లజెండాలు ప్రదర్శించారు. ‘లష్కరే రాహుల్’ అంటూ నినాదాలు చేశారు.ఢిల్లీలోని ఏఐ సమిట్ హాలులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారంనాడు వీరంగం సృష్టించారు. చొక్కాలు విప్పి గాలిలోకి ఊపుతూ మోదీకి, అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి నిరసనగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణ హరి, బీహార్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుందన్ యాదవ్, ఉత్తరప్రదేశ్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త నరసింహ యాదవ్‌లను అరెస్టు చేశారు. వీరికి కోర్టు శనివారంనాడు ఐదు రోజుల రిమాండ్ విధించింది.ఏఐ ఈవెంట్‌కు అంతరాయం కలిగించేందుకు ముందుగానే నిర్ణయించుకున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు క్యూఆర్ కోడ్‌లను సంపాదించి కట్టుదిట్టమైన భద్రత కలిగిన వేదిక హాలులోకి అడుగుపెట్టినట్టు చెబుతున్నారు. వారిని గుర్తించేందుకు పోలీసులు ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించారు. భారీ కుట్రకు ప్లాన్ జరిగిందా అనే దానిపై ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు.



## సిద్దిపేట కలెక్టరేట్‌లో రైతు మృతిపై నివేదిక పంపించండి..

### చీఫ్ సెక్రటరీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశం

కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంలో భాగంగా రామకృష్ణయ్య (55) అనే రైతు తన రెండు ఎకరాలు భూమిని ప్రభుత్వం తీసుకోగా.. దానికి సంబంధించిన 29 లక్షల భూ పరిహారం కోసం గత సంవత్సరం సిద్దిపేట కలెక్టరేట్‌కు వెళ్లి అధికారులు సరిగా స్పందించకపోవడంతో కలెక్టరేట్‌లో అధికారుల కోసం రోజుల తరబడి తిరుగుతూ, వేచి చూస్తూ ఆగస్టు 21న కలెక్టర్‌లోనే గుండె పోటుతో ప్రాణాలు విడిచిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, సామాజికవేత్త కారుపోతుల రేవంత్ గౌడ్ రైతు మృతి ఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.. బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) లో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు రాష్టవ్యాప్తంగా భూపరిహారం కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్న మిగతా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా పరిహారం త్వరితగతిన అందించాలని, ప్రభుత్వ కార్యాలయంలో బాధితులపై నిర్లక్ష్యం వ్యవహరించకుండా వారి వయసు రీత్యా వారికి తగిన గౌరవం ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన జాతీయ మానవ హక్కుల కమిషన్ రైతు మృతి ఘటనపై తక్షణమే విచారణ చేపట్టిబాధ్యులపై తీసుకున్న చర్యలు, బాధిత కుటుంబానికి అందిన నష్టపరిహారం, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి నివేదికను నాలుగు వారాల్లోపు కమిషన్ కు సమర్పించాలని తెలంగాణ చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది.

## యూరియా కోసం రహదారిపై రైతుల ధర్నా



వేములపల్లి, ఫిబ్రవరి 21 : యూరియా అవస్థలు తాళలేక రైతులు నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై భైఠాయించి ధర్నా చేశారు. నల్లగొండ జిల్లా వేములపల్లి సొసైటీ దగ్గర రైతులకు యూరియా దొరకక ఇబ్బందులు పడి ఆన్‌లైన్‌లోనూ యూరియా బుక్ కాక అవస్థలు పడుతున్నారు. దీంతో ఓపిక నశించి రోడ్డుపైకి ఎక్కి రైతులు ధర్నాకు ఉపక్రమించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ రైతులకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నాతో రహదారికి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

## బోల్తాపడి పేలిన గ్యాస్ ట్రక్కు.. చిలీలో నలుగురు మృతి

శాంటియాగో: చిలీ దేశంలో ఘోర ప్రమాదం జరిగింది. లిక్విడ్ గ్యాస్‌తో వెళ్తున్న ట్రక్కు ప్రమాదానికి గురైంది. దేశ రాజధాని శాంటియాగో హైవేపై జరిగిన ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. మరో 17 మంది గాయపడ్డారు. హైవేపై వెళ్తున్న వాహనం తొలుత బోల్తా కొట్టింది, ఆ తర్వాత అది పేలినట్లు అధికారులు చెప్పారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రక్కు అదుపు తప్పి ప్రమాదానికి లోనైంది. దుర్ఘటనలో ట్రక్కు డ్రైవర్ తన ప్రాణాలు కోల్పోయాడు.ట్రక్కు బోల్తా పడిన తర్వాత ఆ వాహనం నుంచి లిక్విడ్ గ్యాస్ వ్యాపించింది. ఆ రూట్లో వెళ్తున్న వాహనాలు ఎక్కడిక్కడ ఆగిపోయాయి. పొగ విస్తరిస్తున్న విజువల్ సీసీ కెమెరాలకు చిక్కాయి. ఆ తర్వాత తీవ్ర స్థాయిలో మంటలు అంటుకున్నాయి. స్థానిక గాస్కో గ్యాస్ కంపెనీ ట్రక్కు ప్రమాదానికి గురైనట్లు గుర్తించారు. లిక్విడ్ గ్యాస్ పేలడం వల్ల సుమారు 200 మీటర్ల వరకు మంటలు వ్యాపించాయి. 50 వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రమాదం పట్ల దేశాధ్యక్షుడు గాబ్రియల్ బోరిస్ విచారం వ్యక్తం చేశారు



# ఏపీలో పెరగనున్న50 నియోజకవర్గాలు

తిరుపతి, ఫిబ్రవరి 21, కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ? 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను? విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు. ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.

# లోకేష్ ను హీరో చేస్తున్న జగన్



విజయవాడ, ఫిబ్రవరి 21, వైసీపీ అధినేత మాజీ సీయం జగన్ మోహన్ రెడ్డి తెలిసి అన్నారో లేక అనుకోకుండా అనేసారో తెలీదు కానీ తనకు లోకేష్ తోనే పోటీ అని తేల్చశారు. తాజాగా పెట్టిన ప్రెస్ మీట్లో ఆయన చంద్రబాబు, పవన్తో పాటు నారా లోకేష్పై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అయన టార్గెట్ లోకేష్ వైపే నడిచింది. శ్రీలంకలో ఇండియా ఆడుతున్న ౹20 వరల్డ్ కప్ మ్యాచ్ చూడడానికి ప్రత్యేకంగా లోకేష్ వెళ్ళాలా? ఇంట్లో కూర్చుని చూడకూడదా అంటూ ఆయన సెటైరికల్గా మాట్లాడారు. ఇప్పటికే లోకేష్పై వచ్చిన విమర్శలకు ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత డబ్బుతో మ్యాచ్ చూడడానికి వెళ్లినట్టుగానే చెప్పుకొచ్చారు లోకేష్. దానిపై మాజీ ముఖ్యమంత్రి హోదాలో జూ జగన్ ఇప్పుడు మాట్లాడడం ద్వారా సామాన్య జనాలకు ఒక మెసేజ్ ఇచ్చేసారు జగన్ అంటున్నారు ఎనలిస్ట్ లు. ఎందుకంటే సహజంగా జగన్ మాట్లాడే విధానం ఇలా ఉండదు అనేది వారి విశ్లేషణ.రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు మాత్రమే తన ప్రత్యర్థి అనీ వేరే ఎవరూ తనకు సమానులు కాదు అన్నట్టుగా జగన్ వ్యవహార శైలి ఉండేది. పాదయాత్ర చేసినప్పుడు గానీ సీయం అయ్యాక గానీ చంద్రబాబు టార్గెట్ గానే జగన్ మాటలు ఉండేవి. లోకేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ముక్తసరిగా మాట్లాడి ఆ టాపిక్ ని పెద్దగా హైలైట్ చేసేవారు కాదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఆయన వ్యవహారశైలి అలానే ఉండేది. అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్కసారి కూడా పవన్ ను పేరు పెట్టి పిలవ లేదు జగన్. కేవలం 'దత్త పుత్రుడు ' అని మాత్రమే ప్రస్తావించేవారు. కానీ తాజా ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, లోకేష్ ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోనీ పవన్ ఇప్పుడు ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి తనతో సమానుడు అని భావించినా లోకేష్ ను టార్గెట్ చేయడం తో భవిష్యత్ లో తనకూ లోకేష్ కూ మధ్య మాత్రమే అసలు సిసలు పోటీ అని ఫిక్స్ అయిపోయరారా అనే అభిప్రాయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.అవునన్నా కాదన్నా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలోనూ టీడీపీలోనూ నారా లోకేష్ అండ్ టీమ్ దే హవా అన్నది సుస్పష్టం. మొత్తం వ్యవహారాలు అన్నీ ఆయన టీమ్ చక్క బెడుతోంది. మోదీ, అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు కూడా లోకేష్ తో వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్ టీడీపీ అధినేతగా లోకేష్ ని గుర్తిస్తున్నట్టుగానే ఉంది. టీడీపీ సోషల్ మీడియా యూనిట్స్ కూడా దాన్నే ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా జూ జగన్ కూడా లోకేష్ నే తన పొలిటికల్ ప్రత్యర్థిగా డిసైడ్ అయిపోయిన దృశ్యం తెరపైకి వచ్చేసింది. ఇదివరకూ చంద్రబాబు ను టార్గెట్ చేసి జగన్ మాట్లాడుతూ ఉంటే పవన్ పై ఆయన సామాజిక వర్గ నేతలు లోకేష్ పై జగన్ తరువాతి స్థాయి నేతలూ విమర్శలు గుప్పించే వారు. ఇప్పుడు డైరెక్ట్ గా జగనే లోకేష్ ను టార్గెట్ చేయడం చూస్తుంటే పొలిటికల్ గా కింది స్థాయి కేడర్ కు లోకేష్ తన ఫ్యూచర్ పొలిటికల్ ప్రత్యర్థి అనే సంకేతం ఇస్తున్నారా అనే డౌట్స్ రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.

# హిందూపురంలో బాలయ్య సొంతిల్లు



అనంతపురం, ఫిబ్రవరి 21, హిందూపురం నియోజకవర్గం నందమూరి కుటుంబానికి ఒక కంచుకోట. దివంగత ఎన్టీ రామారావు నుంచి నేటి బాలకృష్ణ వరకు, ఈ గడ్డ నందమూరి వారసులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూనే ఉంది. అయితే, గత పదేళ్లకు పైగా ఇక్కడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బాలయ్యపై ప్రతిపక్షాలు గురిపెట్టే ప్రధాన అస్త్రం 'స్థానికత'. ఈ విమర్శలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, హిందూపురంలోనే తన సొంత ఇంటి నిర్మాణానికి బాలకృష్ణ భూమిపూజ నిర్వహించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.హిందూపురం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న నందమూరి బాలకృష్ణ, గత 12 ఏళ్లుగా అక్కడ అద్దె ఇంట్లోనే నివసిస్తున్నారు. షూటింగ్లు ఉన్నప్పుడు హైదరాబాద్లో, రాజకీయ కార్యకలాపాల కోసం హిందూపురం వచ్చినప్పుడు ఆ అద్దె ఇంట్లో ఉండేవారు. అయితే, ఇవాళ ఆయన తన భార్య వసుంధర దేవితో కలిసి హిందూపురం సమీపంలోని వనం కాలనీలో సొంత ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.వనం కాలనీలోని సర్వే నంబర్ 445లో సుమారు 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇది మూడు అంతస్తుల డూప్లెక్స్ తరహా భవనం కానుంది. ఇందులో నివాసంతో పాటు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు ప్రత్యేక హాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు వీలుగా ఆఫీసు రూమ్లను నిర్మించనున్నారు. ఆధునిక హంగులతో పాటు ఒక చిన్న పార్క్, స్విమ్మింగ్ పూల్, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చేలా గ్రీనరీని ప్లాన్ చేసినట్లు సమాచారం.వైసీపీ నేతలు గతంలో పలుమార్లు "బాలకృష్ణ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తారు, ఆయనకు ఇక్కడ సొంత ఇల్లు కూడా లేదు" అంటూ విమర్శలు చేసేవారు. ముఖ్యంగా వైసీపీ స్థానిక నాయకులు ఆయనను 'నాన్-లోకల్'గా చిత్రించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకోవడం ద్వారా, తాను కేవలం గెలిచి వెళ్ళిపోయే వ్యక్తిని కాదని, ఇక్కడే శాశ్వతంగా ఉంటానని బాలయ్య సంకేతాలిచ్చారు. హిందూపురంలో బాలయ్యకు భారీ అభిమాన గణం ఉంది. అయితే, నాయకుడు ఎప్పుడూ అందుబాటులో ఉండరనే చిన్న అసంతృప్తి కార్యకర్తల్లో ఉండేది. ఇప్పుడు సొంత ఇల్లు ఉండటం వల్ల ఆయన నియోజకవర్గంలో గడిపే సమయం పెరుగుతుందని, తద్వారా స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అభిమానులు భావిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లోనూ తాను సీరియస్ అని బాలయ్య నిరూపిస్తున్నారు. ఇటీవల ఆయన తన సొంత నిధులు రూ. 84 లక్షలు వెచ్చించి నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, ఇప్పుడు సొంత ఇల్లు కట్టుకోవడం వంటివి ఆయన నిబద్ధతను చాటుతున్నాయి.హిందూపురం నియోజకవర్గం అనంతపురం రాజకీయాల్లో అత్యంత కీలకం. ఇక్కడ పట్టు కోల్పోకుండా ఉండాలంటే భౌతికంగా అక్కడ ఉండటం అవసరమని బాలయ్య గుర్తించారు. ఈ సొంత ఇల్లు రాబోయే రోజుల్లో టీడీపీ రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశం ఉంది.మొత్తానికి నందమూరి బాలకృష్ణ తీసుకున్న ఈ నిర్ణయం హిందూపురం ప్రజల్లో సానుకూల పవనాలను పెంచింది. "మా ఎమ్మెల్యే మా వాడు.. మా మధ్యే ఉంటారు" అనే భావన ప్రజల్లో బలంగా నాటుకునేలా ఈ గృహారంభం తోడ్పడుతుంది. కేవలం ఒక భవన నిర్మాణంగా కాకుండా, తన రాజకీయ ఉనికిని మరింత సుస్థిరం చేసుకునే దిశగా బాలయ్య వేసిన 'మాస్ స్టెప్'గా దీనిని అభివర్ణించవచ్చు.

# మంగళంపేటలో ధ్వజారోహణంతో ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి, 2026, ఫిబ్రవరి 21.ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలుపులిచర్ల మండలం మంగళంపేటలో ప్రసిద్ధిచెందిన  శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి.ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు, గరుడ ధ్వజపటాన్ని ఆలయ ప్రదక్షిణగా తీసుకొచ్చారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 08.00 నుండి 09.00 గంటల మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. కాగా, రాత్రి పెద్ద శేష వాహనంపై స్వామివారు విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 08.00 గం.ల నుండి 09.00 గం.లకు, సాయంత్రం 06.00 గం.ల నుండి 08.00 గం.ల వరకు వాహన సేవలు జరుగనున్నాయి.శనివారం సాయంత్రం 06.00 గం.లకు స్వామి వారు పెద్ద శేష వాహనంపై విహరించనున్నారు.వాహన సేవల వివరాలుఫిబ్రవరి 22వ తేదీ ఉదయం చిన్న శేష వాహనం, సాయంత్రం హంస వాహనం, 23వ తేదీ ఉదయం ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం సింహ వాహనం, 24వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమంత వాహనం, 25వ తేదీ ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం 06.00 గం.లకు కల్యాణోత్సవం, రాత్రి 08.00 గం.లకు గరుడ సేవ, 26వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనం, 27వ తేదీ ఉదయం మోహినీ ఉత్సవం, సాయంత్రం గజ వాహనం, 28వ తేదీ ఉదయం 08.00 గం.లకు రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, మార్చి 01వ తేదీన ఉదయం 11.00 గం.లకు చక్ర స్నానం, రాత్రి 07.00 గం.లకు ధ్వజావరోహణం, మార్చి 02వ తేదీ ఉదయం 09.00 గం.లకు పుష్పయాగ మహోత్సవం చేపడుతారు.

# ఏపీలో డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీల జారీలో కీలక మార్పు-త్వరలో జారీ..!

ఏపీలో వాహనదారులకు జారీ చేసే డ్రైవింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ల సర్టిఫికెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ చిప్ ఆధారిత స్మార్ట్ కార్డుల్ని వాహనదారులకు జారీ చేస్తుండగా.. వాటి స్థానంలో తక్కువ ఖర్చుతో మరో మార్పు తీసుకొస్తున్నారు. ఇది వెంటనే అమల్లోకి రాబోతోంది. దీంతో గతంలో జారీ అయిన కార్డుల స్థానంలో వీటిని తీసుకునే అవకాశం కల్పించడంతో పాటు కొత్త కార్డుల్ని సైతం ఇదే విధానంలో జారీ చేయబోతున్నారు.చిప్ స్థానంలో క్యూఆర్ కోడ్ కా?ర్డులు (ంజూ ఉనీలబి) కొత్త వాహనాలు కొనుగోలు చేసినప్పుడు జారీ చేసే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ)కార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ పాసయిన తర్వాత జారీ చేసే స్మార్ట్ కార్డుల్ని గతంలో చిప్ ఆధారిత వ్యవస్థలోకి మార్చారు. దీంతో ఈ స్మార్ట్ కార్డులపై చిప్ కనిపించేది. ఇందులోనే సదరు కార్డుకు సంబంధించిన డేటా అంటే స్టోర్ అయ్యేది. కానీ ఇప్పుడు చిప్ స్థానంలో క్యూఆర్ కోడ్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.




దీంతో ప్రభుత్వానికి డబ్బులు ఆదా కాబోతున్నాయి.డబ్బులిచ్చినా రాని కార్డులు గతంలో తీసుకొచ్చిన చిప్ ఆధారిత విధానంలో ప్రతీ ఆర్సీ లేదా డీఎల్ స్మార్ట్ కార్డు కోసం రూ.200 ఫీజు, పోస్టల్ ఛార్జీలు రూ.35 కలిపి రూ.235 ముందుగానే వసూలు చేసేవారు. కానీ కార్డులు మాత్రం ఇళ్లకు వచ్చేవి కావు. ఆ తర్వాత 2023 నుంచి వాహనదారుల నుంచి ఈ ఛార్జీలు వసూలు చేయడం మానేసి, కార్డులు జారీ చేయడం కూడా మానేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాగానే 2024 అక్టోబర్ 1 నుంచి మళ్లీ ఈ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కానీ కార్డులు మాత్రం ఇవ్వడం లేదు. జనీబీ ఓజీఎ ంశ్రీబనీ ఒతినెవ బెంగళూరు-విజయవాడ వందే భారత్..! కేశినేనికి లోకేష్ బిగ్ టాస్క్..! క్యూఆర్ కోడ్ జారీ ఇలా చిప్ తో కూడిన కార్డుకు 115 రూపాయలు ఖర్చవుతుంటే క్యూఆర్ కోడ్ తో కూడిన కార్డుకు 72 రూపాయలే ఖర్చవుతోంది. దీంతో పాటు చిప్ కార్డుల్లో డేటా రీడ్ చేయాలంటే మళ్లీ వాటికి రీడర్లు కొనాలి. క్యూఆర్ కోడ్ తో అయితే కేంద్ర ప్రభుత్వ వాహన్ పోర్టల్ తో లింక్ అయి ఉంటుంది. దీంతో క్యూఆర్ కోడ్ తో కార్డులే ఇవ్వాలని నిర్ణయించారు. దీని ప్రకారం 2024 అక్టోబర్ 1 నుంచి ఇవ్వాల్సిన కార్డుల్ని జారీ చేస్తారు. అలాగే అంతకు ముందు కార్డులు కావాలంటే తిరిగి అప్లై చేసుకోవాల్సి ఉంటుంది.

# చింతకాయలకు ఫిక్స్...

శ్రీకాకుళం, ఫిబ్రవరి 21, (న్యూస్ పల్స్)టీడీపీలో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ కు త్వరలోనే కీలక పదవి లభించే అవకాశాలున్నాయి. అయితే తొలుత విజయ్ ను రాజ్యసభ కు ఎంపిక చేయాలని భావించినప్పటికీ ఆ ఆలోచన విరమించుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు కీలక పదవి రిజర్వ్ అయిందని, త్వరలోనే చింతకాయల విజయ్ సూపర్ పదవి దక్కబోతుందన్న సమాచారం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులన్నీ ఎక్కువగా యువతకే ఇస్తున్నారు. మంత్రివర్గంలో కావచ్చు. రాజ్యసభ స్థానాల్లో కావచ్చు.. మరేదైనా సరే యువతకు అవకాశం ఇస్తున్నారు.పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని సీనియర్ నేతలను పార్టీ బలోపేతం కోసం వ్యూహాలను, రోడ్ మ్యాప్ లను సిద్ధం చేయడానికే పరిమితం చేయనున్నారు. వారి అవసరాలను, సేవలను పార్టీ వరకే ఉపయోగించుకున్నారు. ఇది ఫిక్స్. ఇక వచ్చే పదవులన్నీ యువతతోనే ఎక్కువగా నిండిపోతాయన్నది కూడా వాస్తవం. నారా లోకేశ్ భావి నేతగా ఎదుగుతున్న తరుణంలో ఆయన తనకంటూ ఒక టీమ్ ను సెట్ చేసుకోవడం ఇప్పటికే ప్రారంభమయింది. ఇంకా కొనసాగుతుందికూడా. అది ఎమ్మెల్సీ పదవి కావచ్చు. రాజ్యసభ పదవి కావచ్చు.. మరేదైనా కావచ్చు. వచ్చే పదవుల్లో ఎక్కువగా యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.అందులో భాగంగా అయ్యన్న పాత్రుడు కుమారుడు విజయ్ ను ఎమ్మెల్సీని చేసి కేబినెట్ లోకి తీసుకోవాలని కూడా పార్టీ నాయకత్వం యోచిస్తున్నారని తెలిసింది. దేశ రాజకీయాలకంటే రాష్ట్ర రాజకీయాల్లోనే చింతకాయల విజయ్ ను ఉంచాలని భావిస్తున్నారు. అయ్యన్నపాత్రుడు కోరిక కూడా అదే. పార్టీ సోషల్ మీడియా విభాగంలో యాక్టివ్ గా పనిచేయడమే కాకుండా చింతకాయల విజయ్ నారా లోకేశ్ కు అత్యంత సన్నిహితుడు. సామాజికవర్గం కోటా కూడా ఇందుకు పనిచేస్తుంది. మంత్రి వర్గ విస్తరణలో చింతకాయల విజయ్ ను కేబినెట్ లో తీసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. విజయ్ పడిన కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వడమే కాకుండా 2029 ఎన్నికలకు విజయ్ బీసీ కోటా కింద ఎంపికవుతారన్న టాక్ పార్టీ వర్గాల్లో బలంగా ఉంది.

# జెండాలు మోసిన వారికే అగ్రతాంబులం

కాకినాడ, ఫిబ్రవరి 21, జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో జనసేన గ్రౌండ్ లెవెల్లో మరింత బలోపేతం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకున్న వారు జనసేన విజయాలకు పనిచేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లో జనసేన క్యాడర్ పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేన సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఇప్పటికే జనసేనకు కార్యకర్తల బలం ఉంది. అభిమానుల బలం కూడా జనసేన సొంతం. ఇక సామాజికవర్గం అండదండలు ఎటూ ఉన్నాయి. అదనంగా క్యాడర్ ను పెంచుకునేందుకు పవన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు.స్థానిక సంస్థల ఎన్నికలతో జనసేన రాష్ట్రంలో బలపడాలని చూస్తుంది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే స్థానిక నాయకత్వం బలంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. దీంతో పాటు జనసేనలో ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని చాలా మంది నిరాశలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని ఎంపిక చేయడమే ధ్యేయంగా పనిచేయాలని, సుదీర్ఘ కాలం పార్టీలో వారి కున్న హిస్టరీని చూసి ఎంపిక చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారు కూడా ఉన్నారు. 2014 నుంచి పార్టీలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది.జనసేన ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉందని జనసేనాని కూడా గుర్తించారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినప్పటికీ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అందరికీ న్యాయం చేయలేకపోయామని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ పదవి రాని వారు మాత్రం తమకు జనసేనలో గుర్తింపు లేదని బాధపడుతున్నారు. అందుకోసమే ఇకపై ఒరిజినల్ జనసైనికులకు, వీరమహిళలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై ఏ పోస్టు భర్తీ అయినా నామినేటెడ్ పోస్టులను ద్వితీయ శ్రేణి నేతల్లో బాగా కష్టపడిన వారిని గుర్తించి, పార్టీ జెండా మోసే వారికే ప్రయారిటీ ఇచ్చేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. త్వరలోనే అది అమలులోకి తీసుకురానున్నారు. ఇకపై జెండా మోసిన వారికే జై కొట్టనున్నారు.

# జగన్ పై కేసుల్లేవ్...

విజయవాడ, ఫిబ్రవరి 21, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయంలో కూటమి సర్కార్ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. జగన్ ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారని? ఆయనపై కేసులు ఎప్పుడు నమోదవుతాయని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న తెలుగు తమ్ముళ్లకు ఇప్పుడు సమాధానం దొరికిందంటున్నారు. జగన్ పై కేసులు రాష్ట్రంలో నమోదయ్యే అవకాశాలు లేవు. అలాగే జగన్ ను అరెస్ట్ కూడా చేయడం జరగదు. ఇది ఎవరో చెప్పింది కాదు. టీడీపీ అగ్ర నేతల నుంచి వచ్చిన సమాచారం అంటున్నారు. జగన్ ను అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసి సానుభూతి ఆయనపై కురిపించడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదు. వచ్చే ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావాలంటే జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నభావన పార్టీ అగ్రనాయకత్వంలో వ్యక్తమవుతుంది.అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ జగన్ పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మద్యం కేసులో కానీ, మరొక కేసులో కానీ వైసీపీ నేతలను, జగన్ కు అత్యంత సన్నిహితులను అరెస్ట్ చేశారు. ఒకరు కాదు... ఇద్దరు కాదు చాలా మంది జగన్ ముఖమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో పనిచేసిన వారిని సయితం అరెస్ట్ చేశారు. కేసులు నమోదు చేశారు. అయితే జగన్ మీద మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంపై టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. జగన్ విషయంలో ఇంత నాన్చుడు ధోరణి ఎందుకని? రెడ్ బుక్ లో జగన్ పేరు లేదా? అని ప్రశ్నిస్తున్నారుకానీ చంద్రబాబు, లోకేశ్ మాత్రం జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని ఫిక్సయిపోయారు. జగన్ ను టచ్ చేస్తే సానుభూతి వస్తుందని, కూటమి ప్రభుత్వ విజయావకాశాలపై దెబ్బపడుతుందని ఢిల్లీ పెద్దలు కూడా సలహా ఇచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ చేయించాలని కొన్నాళ్లు చేసిన ప్రయత్నాలకు కూడా బీజేపీ అగ్ర నేతలు అంగీకరించలేదని తెలిసింది. చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ ఎంత భారీ మూల్యం చెల్లించుకున్నాడో వారు గుర్తు చేసి వద్దని చెప్పి పంపుతున్నారట. అందుకే జగన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఈ టర్మ్ లో వెళ్లే అవకాశం లేదన్నది సుస్పష్టం.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శించిన ఆర్ఐజేసి చంద్రశేఖర్ ఆజాద్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 21:పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర



స్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో యం. రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణ శర్మ, సురేష్ శర్మలు పూర్ణకుంభ స్వాగతంతో ఆర్ఐజేసిని ఆహ్వానించారు.స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించగా, అనంతరం ఆశీర్వాద మండపంలో కంకణధారణ చేసి శాలువా, శేషవస్త్రాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. దేవస్థానం తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అహోబిలంలో సెర్చ్ ఆపరేషన్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 21-నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు, తెల్లవారుజామున అహోబిలంలో ఆళ్లగడ్డ డీఎస్పీ కె. ప్రమోద్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఆపరేషన్‌లో 8 మంది వ్యక్తుల వద్ద నుండి మొత్తం 284 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో 247 విస్కీ సీసాలు, 37 బీర్ సీసాలు ఉన్నాయి. సంబంధితులపై కేసులు నమోదు చేసి చర్యలు ప్రారంభించారు.ముఖ్య ప్రదేశాల్లో వాహనాల తనిఖీలు చేపట్టడంతో పాటు రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగినవారి ఇళ్లలో కూడా తనిఖీలు నిర్వహించారు.అహోబిలం పుణ్యక్షేత్రం కావడంతో అక్రమ మద్యం విక్రయాలు, నాటు సారా, రౌడీయిజం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను సహించబోమని డీఎస్పీ కె. ప్రమోద్ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ ఆపరేషన్‌లో సీఐ బి.వి. రమణ, ఎస్ఐ వరప్రసాద్, రామిరెడ్డి, రాజారెడ్డి, పీరయ్య, జయప్ప పాల్గొన్నారు.

## ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 21: ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ శనివారం రామకృష్ణ పీజీ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమైంది.రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి రిబ్బన్ కత్తిరించి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తొలి మ్యాచ్‌ను డాక్టర్ రవి కృష్ణ, డైరెక్టర్ హేమంత్ రెడ్డి చెస్ బోర్డుపై పావులు కదిలించి ఆరంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెట్టే క్రీడ అని పేర్కొన్నారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చెస్ ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాలు, తెలుగు రాష్ట్రాల జిల్లాల నుండి 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. విజేతలకు 3 లక్షల రూపాయల నగదు బహుమతులు, ట్రోఫీలు, పతకాలు ఆదివారం సాయంత్రం ప్రదానం చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, మణికంఠ, రాజా రమేష్ చక్రవర్తి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## జీరో వేస్ట్ లక్ష్యంతో ఈవేస్ట్ అవగాహన కార్యక్రమం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 21:స్వర్ణ ఆంధ్ర?స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి నెల థీమ్ జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్ కింద శనివారం ఉదయం ఎన్జీవోస్ కాలనీ లలిత నగర్ రామాలయం ప్రాంగణంలో ఈ?వేస్ట్ మరియు డ్రై వేస్ట్ నిర్వహణపై విస్తృత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, వ్యర్థరహితంగా మార్చే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఖలీల్ సిద్ధిఖీ హై స్కూల్,




మున్సిపల్ హై స్కూల్, గురురాజ స్కూల్, సత్య సాయి స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. చేతబట్టిన ప్లకార్డులు, నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ?వేస్ట్ అనగా పాత మొబైళ్లు, కంప్యూటర్లు, విద్యుత్ పరికరాలు వంటివి సాధారణ చెత్తలో వేయకూడదని, వాటిని ప్రత్యేకంగా సేకరించి రీసైక్లింగ్ కు పంపాలని వివరించారు.డ్రై వేస్ట్ నిర్వహణలో భాగంగా మూడు బుట్టల విధానం ప్రాముఖ్యతను వివరించారు. ఇంటి వద్దే తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, హానికర వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం ద్వారా చెత్త నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతి కుటుంబం ఈ విధానాన్ని కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు.సచివాలయం సిబ్బంది, ఎంఇపీఎంఏ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న. , ఎంఇపీఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట దాస్ , మున్సిపల్ డిఇలు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిసి ఈ?వేస్ట్ అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించారు.పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చూడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, జీరో వేస్ట్ లక్ష్య సాధనలో ప్రజల సహకారం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నంద్యాల నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## అభిరుచి మదు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి---




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 21-దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్ సమావేశం సందర్భంగా దేశ ప్రగతిని దిగజార్చే విధంగా యువతి కాంగ్రెస్ గుండాలు వ్యవహరించారని ఆరోపిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం నంద్యాలలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, యువమోర్చా కార్యకర్తలు హాజరై కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు మాట్లాడుతూ దేశాన్ని సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకోవడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. దేశ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన వారిపై ప్రభుత్వం వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం బీజేపీ ఎప్పటికీ పోరాడుతుందని స్పష్టం చేశారు.దేశ వ్యతిరేక ధోరణులను ప్రజలు సహించరని, దేశ ప్రగతికి అడ్డుపడే శక్తులను రాజకీయంగా, ప్రజాస్వామ్య పరంగా ఎదుర్కొంటామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తున్నదని, అదే కాంగ్రెస్ పార్టీకి అసహనానికి కారణమైందని ఆరోపించారు.బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ యువత దేశాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తుందని, దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను తీవ్రంగా ఖండిస్తూనే ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, పట్టణ, మండల స్థాయి నాయకులు, బీజేవైఎం ప్రతినిధులు, మహిళా మోర్చా నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలి

**ఏపీడబ్ల్యూజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లగుండ్ల రామకృష్ణ**

పిడుగురాళ్ల, పల్నాడుజిల్లా పిడుగురాళ్ల లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. చల్లగుండ్ల. రామకృష్ణ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడీటేషన్ విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడీటేషన్ కమిటీ సమావేశాలు జరిగినప్పటికి ఇప్పటి వరకు అక్రిడీటేషన్ ఇవ్వలేదు అన్నారు. చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది, చాలా జిల్లాలలో అన్నీ అర్హతలు కలిగి ఉన్నప్పటికి అక్రిడీటేషన్లు మంజూరు చేయలేదు. బస్సు పాస్ లు రాష్ట్ర వ్యాప్తంగా ఇవ్వక పోవడంతో జర్నలిస్ట్ లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇవ్వని పక్షములో త్వరలో అన్నీ జర్నలిస్ట్ సంఘాలను కలుపుకొని తీవ్ర ఆందోళనలు, చేస్తాము అన్నారు. త్వరలో దీనిపై ప్రభుత్వం స్పందించని పక్షంలో పూర్తి స్థాయిలో ఉద్యమానికి సిద్ధమావుతాము అనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మహమ్మద్. రజాక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతావత్. శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డవల్లి. సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి షేక్. ఖాసీం, రాష్ట్ర ఉపాధ్యక్షులు. షేక్. జానీ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 21:ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల కలెక్టరేట్ ఆవరణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రత చర్యలను పర్యవేక్షించారు.కలెక్టరేట్ ప్రధాన ఆవరణ, పీజీఆర్ఎస్ హాల్ పరిసరాల్లో శుభ్రత చేపట్టి చెత్తను తొలగించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ జీవిత విధానంగా అవలంబించాలని కలెక్టర్ సూచించారు.

## పెరుమాళ్ల పల్లిలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమం

**పాల్గొన్న కలెక్టర్ డా. వెంకటేశ్వర్**

తిరుపతి,తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగంగా జీరో లిటర్ గవర్నెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పాల్గొని గ్రామస్తులకు తడి?పొడి చెత్త వేర్వేరు సేకరణ, రీసైక్లింగ్ సర్క్యులర్ ఎకానమీ ప్రాముఖ్యతపై వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రత్యేక థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జనవరి నుంచి నిరంతరంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఈ నెల కార్యక్రమంలో ఈ నెల థీమ్‌గా జీరో లిటర్ గవర్నెన్స్ అమలవుతోందన్నారు.జీరో లిటర్ గవర్నెన్స్ అంటే ఎటువంటి చెత్త బయట పడవేయకుండా, ఇంటి వద్దే తడి చెత్త?పొడి చెత్త వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించడం అని తెలిపారు. తడి చెత్తను ఎరువుగా మార్చి కూరగాయల సాగుకు వినియోగించుకోవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ వినియోగ వస్తువులుగా తయారు చేయవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా స్వచ్ఛ రథం ద్వారా చెత్త సేకరణ విధానాన్ని ప్రదర్శించారు. ఇద్దరు విద్యార్థులు సుమారు 11 కిలోల పాత నోటుబుక్స్, పేపర్లు అందజేసి, వాటి విలువగా వచ్చిన డబ్బుతో కొత్త నోటుబుక్స్ మరియు స్టేషనరీ కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ విధానం ద్వారా చెత్త తగ్గడమే కాకుండా విద్యార్థులకు, సేకరణదారులకు ఆదాయం కలుగుతుందని తెలిపారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు**

అరకులోయ ,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతిరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో లో భాగంగా ఫిబ్రవరి థీమ్ "జీరో లిట్టర్ గవర్నెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతిరావు మాట్లాడుతూ జీరో లిట్టర్ గవర్నమెంట్ అంటే ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా శుభ్రమైన వాతావరణాన్ని కాపాడుతూ బాధ్యతాయుత పౌరులుగా

వ్యవహరించడం ప్రభుత్వం మాత్రమే కాదు ప్రతి విద్యార్థి, ప్రతి అధ్యాపకులు, ప్రతి పౌరుడు, ఇందులో భాగస్వామి కావాలి అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కోఆర్డినేటర్ కే.బాలరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి, చెత్తను వేరువేరు డస్ట్ బిన్లలో వేయాలి(తడి పొడి హానికర వ్యర్థాలు వేరుచేసి వేయాలని), క్యాంపస్ ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి, పరిశుభ్రమైన క్యాంపస్ మన గౌరవాన్ని పెంచుతుందని విద్యార్థులకు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛఆంధ్ర సభ్యులు జి.సంధ్య మాట్లాడుతూ మన కాలేజీని మన పరిసరాలను చెత్త రహితంగా ఉంచాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని కాపాడాలని, కాలేజీని జీరో లిట్టర్ క్యాంపస్ గా మార్చేందుకు అందరి సహకారం అవసరమని విద్యార్థులకు తెలిపారు ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర సభ్యులు ఓ.చంటి , అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**